తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట యాద్రాద్రి భువనగిరి
శుక్రవారం 22 మే 2026 | పేజీలు : 8
Follow :

## మట్టి మాఫియా గుప్పిట్లో

# గోపాలపురం!

○కనీస లైసెన్స్ లేని మైనర్ల చేతికి ట్రాక్టర్ల స్టీరింగ్ ○రాత్రి, పగలు తేడా లేకుండా అక్రమంగా మట్టి తరలింపు
○చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న మైనింగ్, పోలీస్ అధికారులు

**మాడుగులపల్లి, మే 21 (జనంసాక్షి):**
మండల పరిధిలోని గోపాలపురం గ్రామంలో అక్రమ మట్టి దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది ప్రభుత్వ నిబంధనలను, పర్యావరణ చట్టాలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ కొందరు కేటగిరీ వ్యాపారులు ఇష్టారాజ్యంగా మట్టిని తరలిస్తున్నారు అంతటితో ఆగకుండా, కూలీల ఖర్చులు మిగుల్చుకోవడం కోసం, ఎలాంటి లైసెన్స్ లేని మైనర్ల చేతికి ఏకంగా భారీ ట్రాక్టర్ల స్టీరింగ్‌ను అప్పగిస్తూ ప్రాణాంతక దందాకు తెరలేపారు గోపాలపురం పరిసర ప్రాంతాల్లో మైనర్ పిల్లలు అతివేగంతో, ప్రమాదకరంగా మట్టి ట్రాక్టర్లను నడుపుతున్న దృశ్యాలు స్థానికంగా తీవ్ర భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి



**ప్రభుత్వ ఆదాయానికి గండి ప్రజల ప్రాణాలకు ముప్పు**

ఎటువంటి అనుమతులు లేకుండా, ప్రభుత్వ భూములు, చెరువుల నుంచి రాత్రి పగలు తేడా లేకుండా వందల సంఖ్యలో మట్టి ట్రాక్టర్లు తరలిపోతున్నాయి ఈ అక్రమ రవాణా వెనుక స్థానిక బడా బాబుల హస్తం ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మైనర్ పిల్లలకు భారీ వాహనాలపై నియంత్రణ ఉండదని తెలిసి కూడా, కేవలం తక్కువ జీతాలకే వస్తున్నారని వారిని డ్రైవర్లుగా పెట్టుకోవడం గమనార్హం ఇరుకైన గ్రామ రోడ్లపై ఈ మైనర్లు నడుపుతున్న మట్టి ట్రాక్టర్లు ఎప్పుడు ఎవరిని బలితీసుకుంటాయోనని పాదచారులు, వాహనదారులు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది

**అధికారుల మామూలు నిర్లక్ష్యం?**

గ్రామాల్లో ఇంత బహిరంగంగా పర్యావరణ దోపిడీ, చట్ట ఉల్లంఘనలు జరుగుతున్నా మైనింగ్ శాఖ, రెవెన్యూ స్థానిక పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి అధికారుల అండదండలు లేదా మామూళ్ల పంపిణీ సక్రమంగా జరగడం వల్లే ఈ అక్రమ దందాపై చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి మోటార్ వాహనాల చట్టం ప్రకారం మైనర్లకు వాహనాలిస్తే కఠిన శిక్షలు ఉన్నా, ఇక్కడ మాత్రం అవేవీ వర్తించనట్లుగా మాఫియా రెచ్చిపోతోంది

**టాస్క్‌ఫోర్స్ రంగంలోకి దిగాలి గ్రామస్థుల డిమాండ్**

గోపాలపురంలో జరుగుతున్న అక్రమ మట్టి రవాణాపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని, మైనింగ్ టాస్క్‌ఫోర్స్ బృందాలు ఇక్కడ తనిఖీలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలతో పాటు, మైనర్లతో డ్రైవింగ్ చేయిస్తున్న యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేయాలని, లేనిపక్షంలో గ్రామస్థులమంతా కలిసి అక్రమ రవాణాను అడ్డుకుని పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.



## ఇసుక అక్రమ రవాణాకి పాల్పడితే

# కఠిన చర్యలు

### జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

### మిర్యాలగూడ రూరల్ స్టేషన్ లో ఇసుక రవాణా ట్రాక్టర్ డ్రైవర్ లకు కౌన్సిలింగ్

**జనంసాక్షి, మిర్యాలగూడ :**
ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ హెచ్చరించారు. మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఇసుక రవాణా ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులు, అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారితో ప్రత్యేక కౌన్సిలింగ్ సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు, కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడంతో ప్రభుత్వ ఆదాయం గణనీయంగా పెరిగిందన్నారు. 2024 సంవత్సరంలో ఇసుక ద్వారా ప్రభుత్వానికి రూ.35 కోట్ల ఆదాయం వచ్చిందని, 2025 సంవత్సరంలో అది రూ.43 కోట్లకు పెరిగిందన్నారు. ప్రస్తుతం 2026 సంవత్సరంలో ఇప్పటివరకు ఇసుక ద్వారానే ప్రభుత్వానికి రూ.83 కోట్ల ఆదాయం సమకూరినట్లు తెలిపారు.నల్లగొండ జిల్లా పరిధిలో ఈ సంవత్సరం ఇప్పటివరకు దాదాపు196 అక్రమ ఇసుక రవాణా కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం అక్రమ ఇసుక రవాణాపై అత్యంత సీరియస్‌గా ఉందని, చట్టవ్యతిరేకంగా ఇసుక తరలింపుకు పాల్పడి న వారిపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు.అనుమతులు లేకుండా ఇసుక తరలించడం, అధిక లోడ్‌తో వాహనాలు నడపడం, నకిలీ బిల్లులతో రవాణా చేయడం వంటి చర్యలు నేరమని తెలిపారు. రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా మిగతా 2లో

## సహజ వనరులతో ఆరోగ్యానికి మేలు



వార్తా లోపలి పేజీలో

# మర్రిగూడ రిసార్టుల్లో చీకటి దందా..

### 'విలేజ్ లుక్' ముసుగులో యువత పెడదారి..

**మర్రిగూడ, మే 21 (జనం సాక్షి)**
మర్రిగూడ మండల పరిధిలోని ప్రైవేట్ రిసార్టులు, గెస్ట్‌హౌస్‌లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నా స్థానిక పోలీసుల్లో చలనం లేదనే విమర్శలు తీవ్రమవుతున్నాయి. 'అంతా తెలిసి కూడా మామూళ్ల మత్తులో జోగుతున్నారా?' అని గ్రామస్తులు బహిరంగంగానే నిలదీస్తున్నారు. పరారీలో ఉన్న నేరస్థులు, రౌడీషీటర్లు ఇక్కడే మకాం వేస్తున్నా పోలీస్ నిఘా శూన్యం. గంజాయి, హుక్కా, ఫారన్ లిక్కర్ బహిరంగంగానే దొరుకుతున్నా ఎక్సైజ్, పోలీస్ దాడులు లేవు. రాత్రి 12 దాటినా డీజేలు, పార్టీలతో స్థానికులకు కంటిమీద కునుకు లేదు. 'ప్రైవసీ' పేరుతో మైనర్ బాలబాలికలకు కూడా రూములు ఇస్తున్నారని, అక్రమ సంబంధాలకు కేంద్రాలుగా మారాయని ఆరోపణ.
"ప్రతి వీకెండ్ ఇక్కడ ఏం జరుగుతుందో స్టేషన్‌కు తెలియదా? లైసెన్స్‌లు ఉన్నాయో లేదో ఒక్కసారైనా చెక్ చేశారా? రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గారా?" అని గ్రామ పెద్దలు ప్రశ్నిస్తున్నారు. ఫిర్యాదు చేస్తే 'మా పరిధి కాదు' అని తప్పించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.జిల్లా ఎస్పీ వెంటనే జోక్యం చేసుకొని ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌తో ఆకస్మిక దాడులు చేయాలని, లైసెన్స్ లేని గెస్ట్‌హౌస్‌లను సీజ్ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**మర్రిగూడ రిసార్టులు - వెలుగు ముసుగులో చీకటి నిజాలు**




చట్టానికి కళ్ళు కప్పి యువత భవిష్యత్తును బుగ్గిపాలు చేస్తున్న అక్రమ అడ్డాలు

# సహజ వనరులతో ఆరోగ్యానికి మేలు

**○వ్యాయామం, యోగ, ద్యానం చేయడం తప్పనిసరి.**

**○స్వచ్ఛమైన గాలి,నీరు,వేడి ,నేల ఆస్వాదిస్తేనే ఆరోగ్యం..**

**○సహజ సిద్ధంగా వచ్చే వాటివల్లే ఆరోగ్య ప్రయోజనాలు..**

**మణుగూరు, మే 21 (జనంసాక్షి):** భారతీయ ఆహారపు అలవాట్లలో వేప పుల్ల, మట్టి కుండ,జొన్న రొట్టెకు ప్రత్యేక స్థానం ఉంది. ముందుగా జొన్నలు ప్రపంచంలోని అత్యంత పురాతన ధాన్యాలలో ఒకటి మన భారత దేశంలో కొన్ని వందల సంవత్సరాలుగా మన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రాంతాల్లో జొన్నలు ప్రధాన ఆహారంగా ఉండేవి.ఇప్పుడైతే తెల్ల బియ్యం ఎక్కువగా వాడుతున్నారు కానీ ఒకప్పుడు కరువు ప్రాంతాల్లో ఎక్కువగా జొన్నలే పండేవి. అప్పట్లో చాలామంది ఇళ్లలో జొన్న రొట్టెలు,రాగి సంగటి,సజ్జ వంటి సహజ ధాన్యాలే ప్రధాన ఆహారంగా ఉండేది. పూర్వీకులు పేదవారి ఇంట్లో బియ్యం వండాలి అంటే?అది పండగ రోజు లేదా ప్రత్యేక సందర్భంలో మాత్రమే వండేవారు.బియ్యం ఎక్కువగా ధనిక కుటుంబాల్లోనే తినే ఆహారంగా భావించే వారు. మన దివంగత నేత నందమూరి. తారకరామారావు రెండు రూపాయల కిలో బియ్యం పథకం తీసుకురాకముందు చాలా మందికి బియ్యం అంత సులభంగా అందుబాటులో ఉండేది కాదు.జొన్నలలో ఎక్కువగా పీచు ఉంటుంది ఇది జీర్ణానికి తేలికగా ఉండటమే కాకుండా ఎక్కువసేపు ఆకలి వేయకుండా సహాయపడుతుంది మధుమేహం ఉన్నవారికి బరువు తగ్గాలనుకునేవారికి జొన్న రొట్టె మంచి ఆహారంగా భావిస్తారు.



**వేప పుల్ల దంతధావనం:**

పూర్వం మన పెద్దలు వేప పుల్లని కున్స్ లాగా నమిలి దానితో పళ్ళు తోమకునేవారు. ప్రస్తుతం కాలంలో వేప పుల్ల వినియోగం తగ్గి పోయింది. దంత సంబంధిత సమస్యలు ఎక్కువై పోయాయి బ్రషింగ్ తో పాటు వేప పుల్లతో వారానికి ఒకసారి పళ్లు తోమటమూ. లేదా నెలకోసారి వేప పుల్లతో పళ్లు తోముకుంటే మంచిదని చెబుతు న్నారు. వైద్య నిపుణులు.. ఎందుకంటే వేపలో సూక్ష్మ జీవులను నివారించే యాంటీ బాక్టీరియల్, యాంటీ వైరల్ గుణాలు పుష్కలంగా ఉంటాయి. వేప పుల్లతో పళ్లు తోముకుంటే నోట్లో ఉన్న క్రిములు నిర్మూలించబడతాయి. దంతాలు దృఢంగా మారుతాయి. దంతా లను దృఢంగా మార్చే శక్తి వేప పుల్లకు ఉంది. దీని వల్ల చిగుళ్ల సమస్యలు తగ్గుతాయి.

**మట్టి కుండలో నీళ్లు శ్రేష్టం:**

కుండలో నీళ్లు తాగడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కుండలో నీరు తాగితే శరీర ఉష్ణోగ్రత ను సమతుల్యంగా ఉంటుంది.ఇందులో విష పూరిత రసాయనాలు ఉండవు మట్టిలోని కాల్షియం మెగ్నీషియం వంటి పోషకాలు శరీరానికి అందుతాయి ఆల్కలీన్ గుణం శరీరంలో ఆమ్లాలను తట స్థీకరిస్తుంది గొంతు నొప్పి జలుబు దగ్గు రాదు కుండ రంధ్రాల ద్వారా నీరు ఆవిరై సహజంగా చల్లబడుతుంది ఇప్పటికి కొన్నిచోట్ల కుండలోనే ఆహార పదార్థాలు వండటం వలన రుచిగా తాజాగా ఉంటాయి. ఆధునిక కాలంలో ఫ్రీజ్ ,రాగి పాత్రల్లో నీరు తాగుతారు.దీని వల్ల శరీరానికి అందాల్సిన పోషకాలు అందకపోవడం కొంత అనారోగ్యానికి గురవుతారు.ప్రతి జీవికి ప్రకృతి లభించే వాటి ద్వారా ఎంతో ఆరోగ్యంగా ఉంటారు అవి ఎప్పుడైతే మనం పక్కన పెట్టామో అప్పుడే అనారోగ్యాన్ని గురవుతున్నాము. సూర్యుని నుంచి వచ్చే వేడి డి విటమిన్,బావి నీటిలో పోషకాలు,ప్రకృతి లభించే గాలి ఎంతో ఆరోగ్యం , చేదు తో ఎన్నో జబ్బులకు చెక్ పెట్టవచ్చు. మట్టిలో రోజు నడవడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. సహజ సిద్ధంగా వచ్చే వాటివల్లే ఎక్కువ ప్రయోజనాలు చేకూరుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

# ఇసుక అక్రమ రవాణాకి పాల్పడితే కఠిన చర్యలు

## జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

### మిర్యాలగూడ రూరల్ స్టేషన్ లో ఇసుక రవాణా ట్రాక్టర్ డ్రైవర్ లకు కౌన్సిలింగ్

ఇసుక తరలింపుపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందన్నారు.ట్రాక్టర్ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా గురించి సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.అక్రమ ఇసుక రవాణా కేసుల్లో ఎలాంటి పైరవీలు, సిఫార్సులు నడవవని, చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.జిల్లాలో సహజ వనరుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించే అక్రమ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ డిఎస్పీ రాజశేఖర్ రాజు,రూరల్ సీఐ పి.ఎన్.డి ప్రసాద్, ఎస్.ఐ లు లక్ష్మయ్య, కృష్ణయ్య ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.



# ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి

## రోగులకు పండ్లు పంపిణీ చేసిన సర్పంచ్ నాగరాజు

**బూర్గంపహాడ్ మే 21 (జనంసాక్షి) :**భారతదేశ మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 35వ వర్ధంతిని బూర్గంపహాడ్ పంచా యతీ సర్పంచ్ మందా నాగరాజు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బూర్గంపహాడ్ సీహెచ్సీ ఆసుపత్రిలో రోగులకు నాయకులతో కలిసి పండ్లు పంపిణీ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ మాజీ ప్రధానిగా రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. భారతదేశంలో టెలికాం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి ఆయన ఆధ్యుడన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అమరేందర్ రెడ్డి, మహిళా నాయకురాలు బర్ల నాగమణి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కైపు శ్రీనివాసరెడ్డి, మహేష్, రాజేష్, సంపత్, రాజ్ కుమార్, యుగంధర్, పండు, వేణుగోపాల్, సిద్ధార్థ, బాలు, చైతన్య తదితరులు పాల్గొన్నారు.



# దేశ ప్రగతిలో రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం

## కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు రామనాథం

**పినపాక, మే 21 (జనంసాక్షి):**

దేశ సేవలో ప్రాణత్యాగం చేసిన మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా పినపాక కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు రామనాథం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంగిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ఆధునికీకరణకు, యువత అభివృద్ధికి, సమాచార సాంకేతిక రంగానికి పునాది వేసిన మహానేత రాజీవ్ గాంధీ అని కొనియాడారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం, విద్యా రంగ ప్రగతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి బోడ రమేష్, ఈ బయ్యారం సర్పంచ్ వాగబోయిన చందర్రావు, ఉప సర్పంచ్ సందీప్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు స్వతంత్ర రెడ్డి, ఉడుముల లక్ష్మిరెడ్డి, ముక్కు వెంకటరెడ్డి, మార్త మనోజ్, షేక్ మీరా సాహెబ్, గట్ల బాలిరెడ్డి, గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రంలో అగ్ని ప్రమాదం

**ఖమ్మం రూరల్,మే 21(జనంసాక్షి)**

రూరల్ మండలం తీర్థాలగ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం సమీపంలో రైతులు పొలాల్లో చెత్తకు నిప్పంటించడంతో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గాలులు బలంగా వీయడంతో మంటలు వేగంగా వ్యాపించి కొనుగోలు కేంద్రంలో కాంటాలు వేసి నిల్వ ఉంచిన వరి ధాన్యం బస్తాలకు అంటుకున్నాయి. దీంతో అక్కడ ఉన్న వరి బస్తాలు ఒక్కసారిగా మంటల్లో చిక్కుకుని దగ్ధమయ్యాయి. మంటలను గమనించిన రైతులు వెంటనే వాటిని ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ, ఈదురుగాలుల కారణంగా మంటలు అదుపులోకి రాక తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఆలస్యంగా స్పందించారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ అగ్నిప్రమాదంలో సుమారు వంద వరి ధాన్యం బస్తాలు పూర్తిగా దగ్ధమయ్యాయని, దాంతో లక్షల రూపాయల నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. మంటలు పూర్తిగా అదుపులోకి రాకపోతే మరింత ధాన్యం నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.





# నవ సమాజ నిర్మాణకుడు రాజీవ్ గాంధీ

**మధిర, మే 21 (జనంసాక్షి) :**

మధిర పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారతరత్న, మాజీ ప్రధాన మంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ 35వ వర్ధం తిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయకుమార్ , మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు పాల్గొని రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ దేశంలో ఆధునిక భారత నిర్మాణానికి, సమాచార సాంకేతిక విప్లవానికి, యువతకు రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పించడంలో రాజీవ్ గాంధీ పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ సామినేని సుజాత రామనాథం, వైస్ చైర్మన్ కోన ధని కుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు సెక్రటరీ పులిబండ్ల చిట్టిబాబు మాజీ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐలూరి సత్యనారాయణ రెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి గ్రామ సర్పంచులు, మున్సిపాలిటీ కౌన్సిలర్లు, గ్రామ శాఖ అధ్యక్షులు, డివిజన్ కమిటీ అధ్యక్షులు వివిధ హోదాలలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

**మధిర, మే 21 (జనంసాక్షి) :**
రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి సిఫారసుతో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ద్వారా మంజూరైన రూ 60 వేల చెక్కును మహాదేవపురం గ్రామానికి చెందిన కలక జ్యోతి కి సీనియర్ కాంగ్రెస్ నాయకులు జవ్వాజి ఆనంద రావు గురువారం అందజేశారు. మధిరలోని రేణుక చౌదరి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కర్లపూడి అప్పారావు, నాయకులు ఆవుల గురుబ్రహ్మం, జల్లేపల్లి ప్రసాద్, బాధ సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు కనీస వేతనాలు పెంచడం హర్షణీయం

**బూర్గంపహాడ్ మే 21 (జనంసాక్షి)**
తెలంగాణ రాష్ట్ర కనీస వేతనమండలి 78 షెడ్యూల్ కు సంబంధించి కార్మికులకు కనీస వేతనాల పెంపుపై ఐఎన్టీయూసీ అధ్యక్షులు గోనె రామారావు గురువారం హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 1.11కోట్ల మంది కార్మిక కుటుంబాలకు ఈ వేతన పెంపుతో మేలు చేసి కార్మిక కుటుంబాల్లో వెలుగులు నింపిందన్నారు. పెరుగుతున్న ధరలు, జీవన వ్యయాల సందర్భంగా ఈ నిర్ణయం కార్మిక కుటుంబాల్లో ఉపశమనం కలిగించిందన్నారు. కాంట్రాక్టు, అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు ఈ నిర్ణయం ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. రాష్ట్ర కనీస వేతన మండలి సభ్యుడుగా ఐఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి యారం పిచ్చిరెడ్డి మండలిలో సభ్యులుగా ఉండటం సంతోషంగా ఉందని, ఈ వేతన పెంపులో పిచ్చిరెడ్డి కీలకపాత్ర పోషించారన్నారు. వేతన పెంపు పట్ల సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వేతన మండలి చైర్మన్ జనక్ ప్రసాద్, మంత్రివర్గ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పోస్ట్ ఆఫీస్ పథకాలను సద్వినియం చేసుకోవాలి




**ఎర్రుపాలెం, మే 21 (జనంసాక్షి):**
పోస్ట్ ఆఫీస్ ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హులందరూ సద్వినియోగ చేసుకోవాలని పోస్టర్ సూపరిండెంట్ వి.వీరభద్ర స్వామి అన్నారు. గురువారం మండల పరిధి బంజర గ్రామానికి చెందిన బదావత్ భీలియా నాయక్ కు ప్రమాదం లో మరణించడంతో పోస్ట్ ఆఫీస్ ద్వారా మంజూరైన రూ. 15 లక్షలు ఇన్సూరెన్స్ చెక్కును పోస్టల్ సూపరిండెంట్వి.వీరబద్ర స్వామి చేతులుమీదగాభీలియా నాయక్ భార్య బధావత్ మంగమ్మ కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఎర్రుపాలెం మండలం బంజర గ్రామం లో ఆదిత్య బిర్లా ఇన్సూరెన్స్ ద్వారా750 రూ. ప్రమాద బీమా చెల్లించి ఇటీవల ప్రమాదం లో మరణించిన బధావత్ భీలియా నాయక్ కుటుంబానికి రూ.15 లక్షలు ప్రమాద భీమా ఇన్సూరెన్స్ మంజూరైనట్లు తెలిపారు. పోస్ట్ ఆఫీస్ జిల్లా లో పెద్ద బ్యాంక్ లాంటిదని తెలిపారు.ప్రమాదబీమా ఇన్సూరెన్స్ కేవలం 549రూ.749 రూ.పోస్ట్ ఆఫీస్ ద్వారా చెల్లిస్తే10 లక్షలు, 15 లక్షలు ప్రమాద బీమా ప్రతి ఒక్కరికివర్తిస్తుంది అనీ తెలిపారు.పోస్ట్ ఆఫీస్ ద్వారా ఎన్నో పథకాలు అందుబాటులో ఉన్నాయని, ఎస్.బి, ఆర్. డీ, ఎస్.ఎస్.ఎ, టీ.డీ, పి. పి.ఎఫ్ లాంటి పథకాలు అందుబాటులో ఉన్నాయని,వీటన్నింటిని ప్రజలందరూ ఉపయోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమం లో మధిర అధికారి కొటేష్ , ఐపిపిబి మేనేజర్ లు,ఇతర పోస్టల్ సిబ్బంది, బంజర, జమలాపురం, కంద్రిక సర్పంచ్ లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి



**వలిగొండ, మే 21 (జనంసాక్షి)**
భారతదేశ మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 35 వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు అభిమానులు, పాల్గొన్నారు.

## భద్రాచలం బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జ్ గా రావులపల్లి రాంప్రసాద్



**భద్రాచలం మే 21 (జనంసాక్షి) :**
బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు డిజిటల్ ప్రక్రియలో భాగంగా రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇంచార్జీలను బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రకటించారు. ఈ క్రమంలో భద్రాచలం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జీగా రావులపల్లి రాంప్రసాద్ ను నియమించారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా నిర్వహించి, కార్యకర్తలతో సమన్వయం సాధిస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ నియామకాలు చేపట్టినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ సభ్యత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై బీఆర్ఎస్ అధిష్టానం ప్రత్యేక దృష్టి సారించగా, భద్రాచలం నియోజకవర్గంలో కూడా సభ్యత్వ నమోదును విస్తృతంగా చేపట్టేందుకు పార్టీ శ్రేణులు సన్నద్ధమవుతున్నాయి. రావులపల్లి రాంప్రసాద్ నియామకంపై భద్రాచలం బీఆర్ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ, పార్టీ బలోపేతానికి ఆయన నాయకత్వంలో మరింత ఉత్సాహంగా పనిచేస్తామని పేర్కొన్నారు.

## అత్యావసరం అయితే తప్ప ప్రజలు బయటికి రావొద్దు ఎస్సై కోటేష్



**పాలక వీడు (జనంసాక్షి):**
మండలంలో తీవ్ర ఎండలు, వడ గాల్పులు కొనసాగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కోటేష్ మండల ప్రజలకు సూచించారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు రావొద్దని తెలిపారు. తగినంత నీరు తాగుతూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, చిన్నపిల్లలు, వృద్ధులు ఎండలో ఎక్కువసేపు తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు.

## ట్రాన్స్ ఫార్మర్ వద్ద చర్యలు చేపడుతున్న విద్యుత్ సిబ్బంది

**బూర్గంపహాడ్ మే 21 (జనంసాక్షి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాక పంచాయతీలో ట్రాన్స్కో డీఈ జీవన్ కుమార్ ఆదేశాల మేరకు ఏడీఈ నర్సింహారావు పర్యవేక్షణలో ఏఈ ఉపేందర్ ఆధ్వర్యంలో గురువారం విద్యుత్శాఖ సిబ్బంది ట్రాన్స్ఫార్మర్ల వద్ద హెచ్చుతగ్గులు, లోడ్ బ్యాలెన్స్ పై చర్యలు చేపట్టారు. ఎండవేడిమి ఎక్కువగా ఉండటంతో పాటు వినియోగదారులు ఏసీ, కూలర్లు ఎక్కువ సామర్థ్యం మేరకు వాడుతుండటంతో ట్రాన్స్ఫార్మర్ల వద్ద హైవేల్టేజీ కారణంగా ఫీజులు ఎగిరిపోతున్నాయని.. ఈ క్రమంలో వాటిని సరిచేసేందుకు, హెచ్చుతగ్గులు చేస్తూ, లోడ్ బ్యాలెన్స్ చేస్తూ సిబ్బంది రాత్రనకా, పగలనకా పనిచేస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా ట్రాన్స్ఫార్మర్ల వద్ద ట్రిప్ కావడంతో ఫీజులు పోవడం జరుగుతుందని, ఈ సమస్యను అధిగమించేందుకు ప్రతిరోజూ ఉదయం గంట, సాయంత్రం గంటసేపు విద్యుత్ కు స్వల్ప అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏడీ నర్సింహారావుతో పాటు ఏఈ ఉపేందర్ చెబుతున్నారు. దీనికి వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎల్ఎం సత్యనారాయణ, లైన్ మెన్లు పాల్గొన్నారు.



## ఖమ్మంలో పుస్తకావిష్కరణ చేసిన ఎస్ డబ్ల్యూ ఎఫ్ నాయకులు



**ఖమ్మం కార్పొరేషన్ మే 21 (జనంసాక్షి):**
"ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం-తీసుకోవలసిన జాగ్రత్తలు" అనే పుస్తకాన్ని ఎస్ డబ్ల్యూ ఎఫ్ ఖమ్మం రీజియన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గుండు మాధవరావు,పిట్టల సుధాకర్ కోశాధికారి పగిళ్ళపల్లి నరసింహారావు లతో కలిసి లింగమూర్తి ఆవిష్కరించారు.పుస్తకావిష్కరణ చేసిన లింగమూర్తి ప్రసంగిస్తూ ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసే సందర్భంగా ఎదురయ్యే సమస్యలను వచ్చే నష్టాలు.ఇబ్బందులు ముందే గుర్తించి వాటిని ముందే పరిష్కారం చేయాలని ముందు చూపుతో అధ్యయన బృందాలతో అధ్యయనం చేసి తాజా పరిస్థితులను ఆర్టీసీ యాజమాన్యానికి,ఆఫీసర్స్ కమిటీకి,ప్రభుత్వానికి అభిప్రాయాలు తెలిపిన ఏకైక సంఘం ఎస్ డబ్ల్యూఎఫ్ ఒక్కటేనని పేర్కొన్నారు.టిజిఎస్ ఆర్టీసీ కార్మికులను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేయాలని,విలీన ప్రక్రియలో వచ్చే అనేక సమస్యలు పరిష్కారం చేసుకునేందుకు వీలుగా అన్ని రిజిస్టర్డ్ కార్మిక సంఘాల ప్రతినిధులను విలీన ప్రక్రియలో భాగస్వామ్యులను చేయాలని జూన్ 2వ తేదీన అపాయింటెట్ డేట్ ను ప్రకటించి అమలు చేయాలని, విలీనం ప్రక్రియ ప్రారంభం కంటే ముందే పరిష్కారం కావలసిన సమస్యలు, లయబులిటీస్ ను వెంటనే పరిష్కరించేలా కృషి చేయాలని,ఆర్టీసీలో ప్రజాతంత్ర హక్కులను పునరుద్ధరించాలని,అందుకోసం మెజార్టీ యూనియన్ ను నిర్ణయించడానికి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని,కార్మికుల కోసం కార్మికులే నిర్వహించుకుంటున్న ఆర్టీసీ ఉద్యోగుల పొదుపు మరియు పరపతి సహకార సంఘం (సిసిఎస్) ఎన్నికలు నిర్వహించుకునేందుకు ప్రభుత్వం,ఆర్టీసీ యాజమాన్యం సహకరించాలని, ఆర్టీసీ కార్మికులకు పెన్షన్ సదుపాయం లేనందున ప్రత్యామ్నాయంలో భాగంగా ఉన్న సంక్షేమ పథకాలైన స్టాఫ్ రిటైర్మెంట్ బెనిఫిట్ స్కీమ్ (ఎస్ ఆర్ బి ఎస్),సర్వీస్ లో ఉండి చనిపోయిన వారి కుటుంబ ప్రయోజనం కోసం నిర్వహిస్తున్న స్టాఫ్ బెన్వలెంట్ అండ్ త్రిఫ్ట్ పండ్ (ఎస్ బిటి) లను విలీనం అనంతరం కూడా కొనసాగించాలని, విలీనం అనంతరం కూడా ఆర్టీసీ విస్తరణ,అభివృద్ధి కోసం ఆలోచన చేయాలని,ఆర్టీసీ ఉద్యోగులకు సంపూర్ణ ఉద్యోగ భద్రత కల్పించాలని,విలీనం అనంతరం కూడా ప్రస్తుత వైద్య సదుపాయాలు కొనసాగించాలని,రిటైర్ అయిన వారి సమస్యలు పరిష్కరించాలని,కార్మికులకు అనుకూలంగా సర్వీస్ కండిషన్లు మార్పు చేయాలని, మెడికల్ అన్ ఫిట్ అవుతున్న డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఉద్యోగం కల్పించాలని,అదనపు మానిటరీ బెనిఫిట్ స్కీమ్ ను విలీనం అనంతరం కూడా కొనసాగించాలని, ఇప్పటివరకు పెండింగ్ లో ఉన్న అన్ని రకాల అప్పీళ్లను సత్వరమే సానుకూలంగా పరిష్కరించాలని,మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని,విలీన ప్రక్రియ కొనసాగుతున్న క్రమంలో మరికొన్ని సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉన్నందున ఆయా సందర్భాల్లో యూనియన్ల అభిప్రాయాలను పరిశీలించి విలీన ప్రక్రియను పూర్తి చేయాలని లింగమూర్తి ప్రభుత్వానికి,యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. రీజయన్ అధ్యక్ష కార్యదర్శులు గుండు మాధవరావు,పిట్టల సుధాకర్ లు మాట్లాడుతూ ఏప్రిల్ 22వ తేదీ నుండి 24 వరకు ఆర్టీసీలో కార్మికులు సంపూర్ణ ఐక్యతతో సమ్మె చేశారని,ప్రభుత్వం కూడా వెంటనే స్పందించి అన్ని కార్మిక సంఘాలను చర్చలకు పిలిచి 11% వేతన సవరణ చేస్తూ,యూనియన్ల పై ఉన్న ఆంక్షలు ఎత్తివేసి గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణకు అంగీకారం తెలిపుతూ,ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయటానికి సిద్ధంగా ఉన్నట్లు స్పష్టమైన ప్రకటన చేస్తూ సమ్మె విరమణ చర్యలు తీసుకున్నందుకు వారు ప్రభుత్వానికి,ఆర్టీసీ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు.స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ తరపున ఆర్టీసీ కార్మికుల విలీనంపై అనేక అధ్యయనాలు చేసి రూపొందించిన పుస్తకాన్ని కార్మికులందరూ తప్పకుండా చదవాలని మాధవరావు సుధాకర్ లు విజ్ఞప్తి చేశారు.

# అన్నం పెట్టే రైతన్నలా ఆర్తనాదాలు పట్టవా..?

## ఆగ్రహంతో నడి రోడ్డు మీద వడ్లను కాల్చివేసిన రైతులు

**నాంపల్లి,మే 21 (జనంసాక్షి)**

నెల రోజులుగా మార్కెట్ లో సుమారు వంద వడ్ల రాశులు నిల్వలు లారీలు రాక కోసం నిరీక్షణలో రైతులు,ఎండ కాలం ఎండలో ఆగమైపోతున్న రైతు బతుకులు పట్టించుకొని ప్రభుత్వం, దిక్కుతోచని స్థితిలో అధికారులు ఇది నాంపల్లి మండలంలోని రైతన్నల పరిస్థితి,రాష్ట్రంలో ఇంచుమించు ఎక్కడైనా ఇదే పరిస్థితులు దర్శనం ఇస్తున్నాయి.నాంపల్లి లో రైతుల పరిస్థితి ఇప్పుడు ఎలా ఉంది అంటే వెంకీ పెళ్ళి సుబ్బి చావుకి వచ్చినట్టు ఉంది అనే చందంగా ఉంది.గత నెల రోజుల నుండి మండలంలోని రైతులు వడ్లు అమ్మకం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన మార్కెట్ యార్డు లో వడ్లు రాశులుగా పోసి అవి లారీలు రాక , ప్రభుత్వం కొనక వడ్లు,రైతు ఎండలో ములిగిపోతున్నారు.కండ్లు, చెవులు లేని చందంగా ప్రభుత్వం ప్రవర్తిస్తుంది.దీనితో ఆగ్రహించిన నాంపల్లి మండల రైతులు కొందరు



వడ్లను నడిరోడ్డు మీద పోసి కాల్చివేసి అగ్నికి ఆహుతి చేశారు,రహదారి నిలిపివేసి ప్రభుత్వనికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఇప్పటికైనా కనులు, చెవులు తెరిచి రైతుల బాధలు పట్టించు కోవాలి అని అన్నారు.ఇప్పటికే యువకులు వ్యవసాయం చేయడానికి వెనకడుతున్నారు, పరిస్థితి ఇలాగే కొనసాగితే రైతు అనేవాడు మన దేశంలో ఉండడు అని రైతు గోస పడ్డ రాజ్యం బాగుపడదు అని అన్నారు,ఈ ఆందోళనలో రైతులు బత్తుల శేఖర్, బచ్చనబోయిన అజనేయులు, బచ్చనబోయిన ఈదయ్య, అబ్బనబోయిన నరసింహ పాల్గొన్నారు.



## గుంతలమయమైన నడింబాయిగూడెం
# రోడ్డుకు మట్టి పనులు ప్రారంభం

### హర్షం వ్యక్తం చేస్తున్న నడింభాయి గూడెం గ్రామస్తులు

**పి.ఏ.పల్లి /గుడిపల్లి,మే 21(జనంసాక్షి)**

గుడిపల్లి మండల కేంద్రం నుండి నడింబాయిగూడెం రోడ్డు పూర్తిగా గుంతలమయం కావడంతో గుంతలను పూడ్చడానికి మట్టి పనులను గుడిపల్లి గ్రామ సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి గురువారం నాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నడింబాయి గూడెం గ్రామ ప్రజలు మండల కేంద్రానికి రావడానికి చాలా ఇబ్బంది పడుతున్నారని,అదేవిధంగా రోడ్డు అంతా గుంతలమయం కావడంతో వాహనదారులు చాలా ఇబ్బంది పడుతున్నారు అని రోడ్డుకు మట్టిని పోయించి మరమ్మతులు చేపించి గుంతలను పూడిపించామని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో గుడిపల్లి ఎంపీఓ వడ్త్యా నవీన్, గ్రామ ఉపసర్పంచ్ అరవపల్లి శ్రీనయ్య,ఉమ్మడి మండల మాజీ ఎంపీపీ అర్వపల్లి సరిత నరసింహ, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎర్ర యాదగిరి, మాజీ ఉపసర్పంచ్ బోడ లక్ష్మమ్మ,వార్డు సభ్యులు బోడ నాగరాజు,వడ్లపల్లి మల్లారెడ్డి,వర్కాల జైపాల్ రెడ్డి,సామ రాంరెడ్డి,గ్రామపంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## రైతులు వరి గడ్డి తగలబెట్ట వద్దు - పర్యావరణాన్ని కాపాడాలి

**సంస్థాన్ నారాయణపురం. మే 21(జనంసాక్షి):**

గడ్డి తగులబెట్టడం వల్ల పంటకు ఉపయోగపడే సూక్ష్మజీవులు మరణించి - పంటలు సరి అయిన దిగుబడి రాదు అని దీనిని రైతులకు గుర్తించి గడ్డి తగులబెట్టకూడదు అని భారత కమ్యూనిస్ట్ పార్టీ యాదాద్రి జిల్లా కౌన్సిల్ సభ్యులు చిలువేరు అంజయ్య రైతులను సూచించారు. ఆయన ఈ రోజు తన స్వంత ఖర్చులతో రైతుల పొలాల నుండి గడ్డి కట్టలు తెచ్చి సేకరించి యాదగిరి గుట్ట గోశాలకు ఒక డిసియం బండి నిండా గడ్డి పంపించడం జరిగింది. ఇది రైతులు గుర్తించి - ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు. ఇటీవల రైతు శాస్త్రవేత్తలు - రైతు వేదిక లో వచ్చిన రైతులకు- శాస్త్రయంగా మంచి సూచనలు చేయడం జరిగింది. గడ్డి తగులబేట్టడం మహాపాపం అని గత 30, సం?ల క్రితం రైతులు భావించేవారు. అని ఆయన అన్నారు. వ్యవసాయ సాగు భూమిలో గడ్డి తగలబెట్టడం వల్ల రాబోయే కాలంలో పంటలు సరిగ్గా దిగుబడి రాదు అని ఆయన సూచించారు. ఇట్టి గడ్డి వాహనానికి చిలువేరు అంజయ్య భార్య అయిన చిరువేరు అరుణ జెండా ఊపి వాహనాన్ని పంపించటం జరిగింది.ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యులు. బచ్చనగోని గాలయ్య, మండల సీపీఐ కార్యదర్శి దుబ్బక భాస్కర్,మరియు కలకొండ సంజీవ, మండల రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పల్లె మల్లారెడ్డి, నోముల యాదయ్య, పాక చిన్న జంగయ్య, మాదగోని బాలరాజు, బాలు నాయక్, జక్కిరెడ్డి మల్లారెడ్డి ,చిలువేరు మల్లిఖార్జున్,రాంచందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## జన నేత జన్నుకు విప్లవ జోహార్లు !

**కోదాడ,(జనంసాక్షి):**

సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ జలగం జనార్దన్5వ, వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.అనంతరం అరుణోదయ రాష్ట్ర కార్యదర్శి ఉదయగిరి మాట్లాడుతూ కామ్రేడ్ జలగం జనార్ధన్ భూమి, భుక్తి, పీడిత ప్రజల విముక్తి కోసం, దోపిడీ వ్యవస్థ అంతం కోసం నక్సల్బరీ మార్గాన పయనించిన వ్యక్తి అని అన్నారు. ఈ వ్యవస్థ మారాలని, అసమానతలు పోవాలని అణగారిన ప్రజల పక్షాన సాగే అనేక విప్లవోద్యమాలలో అగ్రభాగాన కదిలి,ప్రజలను కదిలించిన సాహసి అని అన్నారు.రైతాంగం పండించిన పంటకు గిట్టుబాటు ధరల కోసం, కూలీల రేట్ల పెరుగుదల కోసం సాగు,తాగు నీటికోసం ఇలా ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన అనేక ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించిన పోరాట యోధుడని అన్నారు. నిర్బంధాలకు ఏనాడు వెన్ను చూపలేదని అన్నారు. పార్లమెంటరీ పంథాను వ్యతిరేకించి ప్రజాపోరాటాల ద్వారానే ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మి ఆ వైపుగా తన జీవిత పయనాన్ని తుదికంటా కొనసాగించిన విప్లవకారుడని కొనియాడారు. రాష్ట్రంలో,దేశంలో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తు ప్రశ్నించే వ్యక్తులను కట్టడిచేస్తు పాలన సాగిస్తున్న పాలకవర్గాలపై తిరుగుబాటు గొంతుకలై ఉద్యమించడమే కామ్రేడ్ జన్నుకు అర్పించే నిజమైన నివాళి అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఐఎఫ్ టి యు జిల్లా సహాయ కార్యదర్శి వి నరసింహారావు, విజయ్, వీరబాబు, సైదులు,రవితేజ, ఖాసిం,వెంకన్న,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

**చింతపల్లి,మే 21(జనంసాక్షి)**



చింతపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా ఆహ్వా నిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అమ్తుల్ జమాల్ అస్రా ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె మాట్లాడుతూ గ్రూప్స్ ఎంపీసీ, బైపిసి, సీఈసీ,, తో పాటు ఏసి ఈ కొత్త కోర్స్ ను ప్రారంభిస్తున్నామని అలాగే 10వ తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా రోస్టర్ పద్ధతిలో ఎంపిక ఉంటుందని తెలిపారు విద్యార్థులు ఈనెల 25 లోపు ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు...

## ప్రతి ఒక్క రైతు గుర్తింపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

### కోదాడ సహాయ వ్యవసాయ సంచాలకురాలు ప్రశాంతి

**మునగాల, మే 21(జనంసాక్షి):**



మండల పరిధిలోని నరసింహాపురం గ్రామంలో రైతు గుర్తింపు రిజిస్ట్రేషన్ (ఫార్మర్ రిజిస్ట్రేషన్) కార్యక్రమాన్ని కోదాడ సహాయ వ్యవసాయ సంచాలకురాలు ప్రశాంతి గురువారం పరిశీలించారు. పట్టాదారు పాస్ పుస్తకం కలిగిన ప్రతి రైతు ఈ-రైతు రిజిస్ట్రేషన్ గుర్తింపు కార్డు కొరకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఈ-రైతు గుర్తింపు కార్డు రిజిస్ట్రేషన్ కోసం మండలంలోని సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని లేదా రైతుకు దగ్గర్లో గల మీసేవ సెంటర్లో సంప్రదించి ఈ-రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఈ-రైతు గుర్తింపు కార్డు రిజిస్ట్రేషన్ చేయించుకోవడం వల్ల రాబోయే వానాకాలంలో యూరియా పొందాలన్నా, రైతు భరోసా పెట్టుబడి సాయం, రైతు బీమా పొందాలన్నా, కేంద్ర ప్రభుత్వ పథకాలన్నీ సులభంగా పొందటానికి, నేరుగా ఖాతాలోకే ప్రభుత్వ సబ్సిడీలు, రాయితీలు పొందడానికి ఈ-ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి. రాజు, గ్రామ సర్పంచ్ వేమూరి సత్యనారాయణ, వ్యవసాయ విస్తరణ అధికారి మహిత, రైతులు పాల్గొన్నారు.

# ఆలయ హుండీని లెక్కించిన అధికారులు

**కనగల్లు, మే 21 (జనంసాక్షి)**



మండలంలోని ధర్వేశిపురం (పర్వతగిరి) శ్రీ ఎల్లమ్మ అమ్మవారి దేవస్థానం హుండీనీ అధికారులు గురువారం ఆలయ ఆవరణలో లెక్కించారు.55 రోజులకు గాని 9 లక్షల 72 వేల 755 రూపాయల ఆదాయం భక్తుల నుంచి సమకూరినట్లు ఆలయ కార్యనిర్వాహన అధికారి అంబటి నాగిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్వేశిపురం సర్పంచ్ రాయల శేఖర్ మాజీ చైర్మన్ చీదేటి వెంకట్ రెడ్డి, ఇన్స్పెక్టర్ బి సుమతి, పంచాయతీ కార్యదర్శి డి పద్మ, ఆలయ ప్రధాన అర్చకులు నాగోజు మల్లాచారి, సిహెచ్ శ్రవణ కుమారాచార్యులు, గాదే దామోదర్ రావు, సీనియర్ అసిస్టెంట్ జై చంద్రయ్య, జూనియర్ అసిస్టెంట్ లు కె ఉపేందర్ రెడ్డి, ఎన్ ఆంజనేయులు, జే .నాగరాజు కే రాజయ్య, సిబ్బందిసిహెచ్ శ్రీకర్ సాయి సేవ భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.



## సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన

## ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**ఆలేరు మే 21 (జనం సాక్షి ప్రతినిధి)**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో 7 వార్డు మార్కండేయ కాలనీలో 9వ వార్డు బీరప్ప స్వామి ఆలయం వద్ద, పట్టణంలో వైకుంఠధామం వద్ద సీసీ రోడ్డు పనులకు ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనులు త్వర త్వరగా చేయాలని కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. పనులలో నాణ్యత చూపించాలన్నారు . ఆలేరు అంటేనే అభివృద్ధిలో ముందంజలో ఉండే విధంగా చూడడానికి నిరంతరం ప్రజల మధ్యలో ఉంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బాలమణి భాస్కర్, కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అంగిడి ఆంజనేయులు, పట్టణ అధ్యక్షుడు సాగర్ రెడ్డి,కౌన్సిలర్లు మరియమ్మ మార్కు, పస్తం ఆంజనేయులు, సరిత శ్రీకాంత్, జూకంటి సంపత్, నీరజ సిద్ధులు, కో ఆప్షన్ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వర్గీయ భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి



**నేరేడుచర్ల, మే 21(జనంసాక్షి) :**

భారత మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి సందర్భంగా గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన నేరేడుచర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షులు మున్సిపల్ చైర్మన్ కొణతం చిన్న వెంకటరెడ్డి,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల సందీప్ కుమార్ రెడ్డి. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కొణతం చిన్న వెంకటరెడ్డి మాట్లాడుతూ భారతదేశ ప్రధానిగా ఎన్నో సేవలు అందించిన రాజీవ్ గాంధీ ఆశయాలు సాధిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్ రెడ్డి, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కట్టా రామారావు,మాజీ మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్ మున్సిపల్ కౌన్సిలర్లు యారవ లక్ష్మి శ్రీనివాస్,ఇంజమూరి శ్రీకాంత్,బొలిశెట్టి లక్ష్మయ్య, కో ఆప్షన్ సభ్యులు అలక శ్రవణ్ రెడ్డి,మేడారం సర్పంచ్ పారపల్లి సత్యనారాయణ,మార్కెట్ డైరెక్టర్ మచ్చ శీను, మాజీ సర్పంచ్ ఆకారపు వెంకటేశ్వర్లు,మాజీ కౌన్సిలర్ రణపంగా నాగయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు కాసాని సైదులు,సంకల మద్ది లీలామణిషా రెడ్డి, కట్టా గణేష్ రెడ్డి , కుంకు మోహన్ రావు దిద్దకుంట్ల పురుషోత్తం రెడ్డి,కత్తి శ్రీనివాస్ రెడ్డి, మచ్చ గోపాల్, కర్ణం వినోద్,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ అనుమతి లేకుండా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు

## ఎస్ఐ అజ్మీరా రమేష్

**కొండమల్లేపల్లి, మే 21 (జనంసాక్షి):**



ప్రభుత్వ శాఖల ముందస్తు అనుమతులు లేకుండా చెరువులు, కుంటలు, వ్యవసాయ భూములు లేదా ప్రభుత్వ స్థలాల నుంచి మట్టిని తవ్వడం, తరలించడం, చట్టరీత్యా నేరం అని ఎర్ర మట్టి, నల్ల మట్టిని అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ అజ్మీర రమేష్ హెచ్చరించారు. ఇళ్ల నిర్మాణం లేదా ఇతర పనుల కోసం మట్టి అవసరమైతే తహసీల్దార్, రెవెన్యూ అధికారులు, గ్రామ పంచాయతీ, మైనింగ్ శాఖల నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. గురువారం మండల పరిధిలోని చింతకుంట్ల గ్రామంలో అనుమతి లేకుండా ఎర్ర మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లపై కేసులు నమోదు చేశారు.



## అధికారులు విధుల పట్ల నిర్లక్ష్య ధోరణి వహిస్తే కట్టిన చర్యలు తప్పవు : డి ఆర్ డి ఓ నాగిరెడ్డి

వలిగొండ, మే 21 (జనంసాక్షి)

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డీఆర్డీఓ నాగిరెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి జలంధర్ రెడ్డి అధ్యక్షత వహించారు.సమావేశంలో కార్మికుల మొబిలైజేషన్, సోక్‌పిట్స్ నిర్మాణం, అంగన్‌వాడీ భవనాల నిర్మాణం, ఇందిరమ్మ ఇళ్ల పనుల పురోగతిపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ప్రతి గ్రామంలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.త్వరలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పనుల స్థితిగతులను పరిశీలిస్తామని, విధుల పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అలాగే సీబీఎస్ వెరిఫికేషన్‌ను ప్రతి మూడు నెలలకు ఒకసారి తప్పనిసరిగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. పెన్షన్లు పొందుతూ మరణించిన లబ్ధిదారుల వివరాలను వెంటనే గుర్తించి, వారి పెన్షన్లను తక్షణమే తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.తెలంగాణ ప్రభుత్వం నుంచి అందిన సమాచారం ప్రకారం వివిధ వర్గాలకు సంబంధించిన కొత్త పెన్షన్ దరఖాస్తుల స్వీకరణ త్వరలో ప్రారంభం కానుందని తెలిపారు. అందువల్ల గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, వర్గాల వారీగా జాబితాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు.అదేవిధంగా ఎన్ఎఫ్‌బీఎస్ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను సమావేశంలో వివరించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు తమ గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న అర్హులైన లబ్ధిదారులకు ఎన్ఎఫ్‌బీఎస్ పథకం ప్రయోజనాలు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో మండల పంచాయతీ అధికారి వై. ప్రేమలత , ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ రమ్యశ్రీ , ఏపీఓ పరశురాములు , ఈసీ విక్రమ్ , జూనియర్ అసిస్టెంట్ ఎం.డి. సమీయుద్దీన్ , ఏఈ హౌసింగ్ కిరణ్ , అశోక్ గహ, హౌసింగ్ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు , గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మాకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం

### గాంధీనగర్ నల్ల పోచమ్మ వాడలో ఇల్లు, స్థలాలు కోల్పోయిన బాధితులు

**యాదగిరిగుట్ట మే 21 (జనంసాక్షి)**



యాదగిరిగుట్ట అభివృద్ధిలో భాగంగా పట్టణంలోని గాంధీ నగర్ నల్ల పోచమ్మ వాడలో నివాస గృహాలు స్థలాలు, భూములు కోల్పోయిన వారికి న్యాయం జరిగే వరకూ తమ పోరాటాన్ని కొనసాగిస్తామని, ఇండ్లు స్థలాలు భూములు కోల్పోయిన బాధితుల జేఏసీ సభ్యులు తెలిపారు. గురువారం గాంధీనగర్ నల్ల పోచమ్మ వాడలో బాధితులు మీడియాతో మాట్లాడారు. యాదగిరిగుట్ట కొండ చుట్టూ రింగ్ రోడ్డు నిర్మాణంలో భాగంగా గాంధీనగర్ గోశాల గేటు నుండి మసీదు వరకు రోడ్డుకు ఎడమవైపున ఉన్న నివాస గృహాలు, వ్యాపార సముదాయాలు మడిగలు గత ప్రభుత్వం తమ నుండి తీసుకుందని వారు తెలిపారు. ఇందుకు బదులుగా 329 సర్వే నెంబర్ నెమలి వెంచర్ లో ప్లాట్లు కేటాయించినప్పటికీ కోర్టు కేసుల వల్ల వాటిని తమకు స్వాధీనం చేయలేదని తెలిపారు. యాదగిరిగుట్ట అభివృద్ధిలో భాగం అయ్యేందుకు తాము ప్రభుత్వానికి సహకరించి ఇండ్లు ,ఇంటి స్థలాలు, మడిగలు, దుకాణాలు ఇచ్చినప్పటికీ తమకు ఇంతవరకు న్యాయం జరగలేదని అన్నారు. ఇంటికి ఇల్లు, దుకాణానికి దుకాణం కేటాయిస్తామని గత ప్రభుత్వం చెప్పినప్పటికీ అమలు చేయలేదని, ప్రస్తుతం తమ పరిస్థితి రోడ్డున పడి దీనవస్థలో ఉందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యలు తమకు న్యాయం చేయాలని అన్నారు . తమకు నష్టపరిహారం పూర్తిస్థాయిలో అందజేయడంతో పాటు ఇంటికి ఇల్లు,దుకాణానికి దుకాణం కేటాయించాలని కోరుతున్నామని అన్నారు. ఇప్పటికే ఈ సమస్యపై జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు అనేక మార్లు వినతి పత్రాలు అందజేసినా తగిన స్పందన లేదని అన్నారు. తమకు న్యాయం జరిగే వరకూ తమ పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో బాధితుల జేఏసీ సభ్యులు రాచకొండ జానకిరామ్, చిత్తార్ల కృష్ణ, శివకోటి వీరస్వామి , కొంగరి లావణ్య , కాదునూరి కౌసల్య మోతే మదర్, పేరపు సిద్ధులు, పబ్బని లక్ష్మి , శివకోటి భాస్కర్, బి లలిత, తోట ఆంజనేయులు, మోతే వెంకటయ్య, గుజ్జ రాజేశ్వర్ , నాగభూషణం, రాచకొండ ప్రేమ సుల్తానా మిట్ట చంద్రమౌళి , నవీన్ , ములుగు పోచమ్మ, పోరుగంటి దశరథ, ఎర్ర పోచయ్య, ఆకారపు ఎల్లయ్య, రామాంజనేయులు మోతే ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## శివాలయం నిర్వహణ గ్రామపంచాయతీ తీసుకోవాలి

### సర్పంచ్ కి వినతి



**మునుగోడు, మే 21 (జనంసాక్షి)**

మునుగోడు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని స్థానిక శివాలయ నిర్వహణ బాధ్యతను తక్షణమే గ్రామపంచాయతీ ఆధీనంలోకి తీసుకోవాలని 6వ వార్డు సభ్యుడు యాసరాని దినేష్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన గ్రామపంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ పి రమాదేవి లకు ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా దినేష్ మాట్లాడుతూ ఆలయానికి సంబంధించిన నిధులు, ఆదాయం, ఖర్చుల విషయంలో ఎలాంటి పారదర్శకత లేకపోవడం వల్ల గ్రామస్తులలో తీవ్ర అసంతృప్తి నెలకొందని పేర్కొన్నారు. ఆలయ ఆస్తుల రక్షణ, ధూపదీప నైవేద్యాల నిర్వహణ సక్రమంగా జరగడం లేదని విమర్శించారు.ఆలయ స్థలాలు, దీర్ఘకాలిక ఆస్తుల సంరక్షణకు తగిన చర్యలు చేపట్టాలని,ఆలయ ఆదాయ - వ్యయాల వివరాలను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించి, తద్వారాలభించే ఆదాయంతో ఆలయ అభివృద్ధికి, మెరుగైన భక్తుల సౌకర్యాలకు ఖర్చు చేయాలని అన్నారు.ఆలయ పర్యవేక్షణకు గ్రామస్తులతో ఒక ప్రత్యేక కమిటీని నియమించాలని కోరారు.ఆలయ ఆస్తుల రక్షణను దృష్టిలో ఉంచుకొని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఆలయ నిర్వహణను గ్రామపంచాయతీ పరిధిలోకి తీసుకురావాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు ప్రజలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

## ఏఈఓ జానయ్య

**నూతనకల్ మే21(జనంసాక్షి)**

నూతనకల్ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి బుషిగంపల జానయ్య రైతులను వారి ఇంటి వద్దకు వెళ్లి వారి యొక్క ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియను అగ్రి స్టాక్ యాప్ నందు ఆన్లైన్ విధానం ద్వారా పొందుపరిచారు ప్రస్తుతము వ్యవసాయ శాఖ నందు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న రైతు భరోసా, రైతు బీమా, పిఎం కిసాన్, క్రాప్ బుకింగ్, డిజిటల్ క్రాపు సర్వే, వ్యవసాయ యాంత్రీకరణ, ధాన్యం కొనుగోలు, పీఎం కుసుం పథకాల నందు లబ్ది పొందుటకు , ఆన్లైన్ విధానం ద్వారా విత్తనములు మరియు ఎరువులు పొందుటకు ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్ (రైతు గుర్తింపు నమోదు )ప్రక్రియ అనేది చాలా ముఖ్యమైనదిగా రైతులందరూ భావించాలని వారు తెలియజేసినారు భవిష్యత్తులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టబోయే నూతన పథకాలకు కూడా ఇది అత్యంత ప్రామాణికము అని వారు తెలిపినారు నూతనకల్ , చిల్పకుంట్ల, ఎర్ర పహాడ్ గ్రామాల నందు మొత్తం రైతులు 2625 మంది పట్టాదారు కలిగిన రైతులు ఉన్నారని, ఇందులో 1725 మంది రైతులు ఇప్పటివరకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఇంకను 900 మంది రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోలేదు అని తెలియజేసినారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోనటువంటి రైతులు వ్యవసాయ శాఖ నందు ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నటువంటి అన్ని రకాల పథకాలకు లబ్ధి పొందుటకు అనర్హులుగా పరిగణించబడతారు అని వారు తెలియజేసినారు కావున ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోనటువంటి రైతులు అందరూ కూడా క్లస్టర్ పరిధిలోని రైతు వేదికల నందు లేదా మీ వద్దకు వచ్చే కామన్ సర్వీసింగ్ సెంటర్ ఎన్యూమరేటర్ మీ యొక్క మొబైల్ మరియు ఆధార్ లకు వచ్చేటటువంటి ఓటీపీలను చెప్పి ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిందిగా వారు రైతులను కోరినారు చివరి తేదీ 31-05-2026 వరకు మాత్రమే ఉన్నదని వారు తెలిపినారు

ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో రైతులు బండపల్లి కిషన్, భూ రెడ్డి మధుకర్ రెడ్డి, గుండెబోయిన సతీష్, గాజబోయిన సైదులు పాల్గొన్నారు.



# కాలినడకన కాదు సైకిల్‌పై విప్ బీర్ల ఐలయ్య యాత్ర!

## ●మోటకొండూరులో ఐలన్న మార్క్ రివ్యూ.. ●అధికారులకు కీలక ఆదేశాలు!



**మోటకొండూరు, మే 21 (జనంసాక్షి):**
పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలకు నిరసనగా ఆలేరు ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య యాదగిరిగుట్ట పట్టణం నుండి మోటకొండూరు మండలం వరకు భారీ సైకిల్ యాత్ర చేపట్టారు. సామాన్య ప్రజల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నంలో భాగంగా తనదైన శైలిలో ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించి అందరి దృష్టిని ఆకర్షించారు.

**ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన**
సైకిల్ యాత్ర అనంతరం మోటకొండూరు మండలంలో ఎమ్మెల్యే ఐలయ్య గారు సుడిగాలి పర్యటన చేశారు. ఐలన్న మార్క్ శైలిలో ప్రజా సమస్యలపై సమీక్ష నిర్వహించారు. మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అన్నదాతల కష్టానికి తగిన గౌరవం దక్కేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

**కార్యాలయాల నిర్మాణ పనుల నాణ్యతపై నిఘా**
మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న మండల ప్రజా పరిషత్ కార్యాలయం మరియు తహసిల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడంతో పాటు, గడువులోగా వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను, అధికారులను ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలో ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.

**రాజీవ్ గాంధీ వర్ధంతి నివాళులు**
భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా మోటకొండూరు మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి అంజలి ఘటించారు. ఆధునిక భారతదేశ సాంకేతిక విప్లవానికి రాజీవ్ గాంధీ వేసిన పునాదులను, దేశానికి ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.

**జర్నలిస్టుల ప్రశ్నకు స్పందన - 9 నెలల్లో రోడ్డు పూర్తి**
ఈ పర్యటనలో భాగంగా కాటేపల్లి నుండి మోటకొండూరు వరకు పూర్తిగా దెబ్బతిన్న ఆర్ అండ్ బి రోడ్డు పనులను పూర్తి చేయాలని స్థానిక విలేకరులు ఎమ్మెల్యే ని ప్రశ్నించగా.. ఆయన సానుకూలంగా స్పందించారు. వెంటనే సంబంధిత, ఉన్నతాధికారులతో ఫోన్ లో మాట్లాడి, రాబోయే 9 నెలల కాలంలో ఈ రోడ్డు పనులను పూర్తి చేసి ప్రజల రవాణా కష్టాలను తీరుస్తామని సభాముఖంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ సాంఘీక సంక్షేమ సైనిక మహిళా డిగ్రీ కళాశాలలో ఫ్యాకల్టీ నియామకాలు

### మే 22 నుండి జూన్ 5 వరకు దరఖాస్తుల స్వీకరణ

**భూదాన్ పోచంపల్లి, మే 21 (జనంసాక్షి):**
మండలంలోని దేశ్‌ముఖి గ్రామంలో గల తెలంగాణ సాంఘీక సంక్షేమ సైనిక మహిళా డిగ్రీ కళాశాలలో ప్రఖ్యాత ఏఎఫ్‌క్యాట్, ఎన్‌డీఏ (యూపీఎస్సీ) వంటి కోర్సులకు అనుభవజ్ఞులైన ట్రైనర్స్, ఫ్యాకల్టీ నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు. మ్యాథమెటిక్స్, రీజనింగ్, ఆప్టిట్యూడ్, ఇంగ్లీష్ మరియు జనరల్ స్టడీస్ (ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, జీకే, కరెంట్ అఫైర్స్) సబ్జెక్టుల్లో బోధన అనుభవం కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు మే 22 నుండి జూన్ 5 వరకు తమ బయోడేటా, విద్యార్హతల ధ్రువపత్రాలతో కళాశాలలో ప్రత్యక్షంగా హాజరుకావాలని సూచించారు.

## దేశానికి సైన్స్ అండ్ టెక్నాలజీ విద్యావ్యవస్థలను అందించిన రాజీవ్ గాంధీ



**కొండమల్లేపల్లి, మే 21 (జనంసాక్షి):**
భారతరత్న మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఉట్కూరి వేమన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం మహానేత రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు మాట్లాడుతూ భారతదేశానికి శాస్త్ర సాంకేతిక రంగానికి నాంది పలుకుతూ సైన్స్ అండ్ టెక్నాలజీ కి నాంది పలికారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తుంగతుర్తిలో డాగ్ స్క్వాడ్ విస్తృత తనిఖీలు

### ఎస్సై క్రాంతి కుమార్



**తుంగతుర్తి మే 21 (జనంసాక్షి)**
గంజాయి లాంటి మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల నిర్మూలన లక్ష్యంగా పోలీస్ శాఖ పనిచేస్తుందని తుంగతుర్తి ఎస్సై క్రాంతి కుమార్ అన్నారు, గురువారం మండల కేంద్రంలో గంజాయి, మాదకద్రవ్యాలను గుర్తించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తో విస్తృత తనిఖీలు నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నార్కోటిక్ డాగ్, పోలీసు సిబ్బంది. ఎస్పీ నరసింహ ఐపిఎస్ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.సమాజంలో గాంజా ఇలాంటి మాదకద్రవ్యాన్ని నిర్మూలించడం లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ అనుక్షణం కృషి చేస్తుంది అని అన్నారు, ముఖ్యంగా టీ స్టాల్స్, పాన్ షాప్స్, రోడ్డు వెంట ఉన్న హోటల్స్, బస్టాండ్, కూరగాయల దుకాణాలు నందు నార్కోటిక్ డాగ్ తో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.



## విద్యుత్ కార్మికుల ఐక్యతే విజయానికి బాట

### పాల్వాయి సబ్‌స్టేషన్‌లో ఘనంగా తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ 327 ఐఎన్‌టీయూసీ జెండా ఆవిష్కరణ

### ఎండా వానా లెక్కచేయని విద్యుత్ వీరులు:లైన్మెన్ అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో

**గుర్రంపోడు మే 21 (జనంసాక్షి)**
నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం దేవరకొండ డివిజన్ పరిధిలోని పాల్వాయి గ్రామ సబ్‌స్టేషన్‌లో తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ 327 ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ కార్మికుల ఐక్యత, హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం అందరూ ఒకే తాటిపై నిలవాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.లైన్మెన్ అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ నిరంజన్ ఆలీ, లైన్ ఇన్స్పెక్టర్ బంగారు రవికుమార్, విద్యుత్ శాఖ సిబ్బంది, కార్మిక సంఘ నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభం నుంచే విద్యుత్ కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి కార్మిక శక్తి జిందాబాద్ వంటి నినాదాలతో పాల్వాయి సబ్‌స్టేషన్ పరిసరాలు మార్మోగాయి.ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు విద్యుత్ కార్మికులు ప్రజలకు 24 గంటలు నిరంతర సేవలు అందిస్తున్నారన్నారు. అర్ధరాత్రి సమయంలోనైనా, భారీ వర్షాలు, గాలివానలు, మండే ఎండలు వచ్చినా ప్రాణాలను పణంగా పెట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తూ ప్రజలకు సేవ చేస్తున్నారని కొనియాడారు. విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కార్మికుల కృషి వల్లనే గ్రామాలు వెలుగులతో కళకళలాడుతున్నాయని పేర్కొన్నారు.విద్యుత్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం గుర్తించి భద్రతా చర్యలు, సంక్షేమ పథకాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్మికుల ఐక్యతే వారి బలమని, హక్కుల సాధన కోసం అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.అనంతరం పాల్వాయి సబ్‌స్టేషన్ ప్రాంగణంలో తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ 327 ఐఎన్‌టీయూసీ జెండాను ఘనంగా ఆవిష్కరించారు. జెండా ఎగురవేసిన వెంటనే కార్మికులు ఉత్సాహంగా నినాదాలు చేస్తూ సంఘీభావాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ విద్యుత్ కార్మికుల సేవలను అభినందిస్తూ ఐక్యతకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమం పాల్వాయి గ్రామంలో కార్మిక సంఘ చైతన్యానికి ప్రతీకగా నిలిచింది.

## వంశీకృష్ణపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



**కోదాడ,( జనం సాక్షి):**
?మహా న్యూస్ యాజమాన్యంపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ స్వేరో నెట్‌వర్క్ జిల్లా అధ్యక్షులు బొల్లికొండ వీరస్వామి ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా ఎస్పీకి గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక మైనర్ బాలికపై జరిగిన అత్యాచార ఘటనపై ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి నిందితుడి బాగోతాన్ని బయటపెట్టారన్నారు.?అయితే, సమాజానికి వాస్తవాలు వివరించిన ఆర్‌ఎస్పీని అభినందించా ల్సింది పోయి, మహా న్యూస్ ఛానల్‌లో ఆయనపై అసభ్యకరమైన పోల్ నిర్వహించడం దుర్మార్గమన్నారు. ఆర్‌ఎస్పీ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరించిన వంశీకృష్ణపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు పిడమర్తి దశరథ, పాల్వాయి లక్ష్మణ్, పీపీఎల్ రాష్ట్ర అధ్యక్షులు మచ్చ నర్సయ్య, కొండ కిరణ్, లలిత, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు..

## జూన్ 1న సీఎం క్యాంప్ ఆఫీస్ ముట్టడి

### మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

**కోదాడ,( జనం సాక్షి):**
గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టిన మాజీ సర్పంచులకు రావలసిన పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 1న చేపట్టబోయే ముఖ్యమంత్రి క్యాంప్ ఆఫీస్ ముట్టడిని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపునిచ్చింది. గురువారం కోదాడ పట్టణంలో క్యాంప్ ఆఫీస్ ముట్టడికి సంబంధించిన వాల్ పోస్టర్లను జేఏసీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు సురివి యాదయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకు ఐదేళ్ల కాలంలో సర్పంచులు అప్పులు తెచ్చి మరీ గ్రామాల్లో ఎన్నో ప్రగతి పనులు చేపట్టారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎస్ఎఫ్‌సీ,ఎస్‌డీఎఫ్, సీడీఎఫ్ మరియు మన ఊరు మన బడి నిధులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు రాకపోవడంతో మాజీ సర్పంచులు కొందరు ఆత్మహత్యలు చేసుకోగా మరికొందరు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బిల్లులు చెల్లించకపోతే జూన్ 1న హైదరాబాద్‌లోని సీఎం క్యాంప్ ఆఫీస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ ముట్టడి కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న మాజీ సర్పంచులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కేశబోయిన మల్లయ్య యాదవ్, కోదాడ మండల సర్పంచ్ ల ఫోరం మాజీ అధ్యక్షులు దొంగల లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ పొట్ట శ్రీ విజయ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.




# పంగనామాల శ్రీనివాసుడు

- ఎందరో ప్రభుత్వ ఉద్యోగులను మోసగించిన చరిత్ర
- తోడపుట్టిన వారితోనూ సఖ్యతలేని నైజం
- టెన్త్, ఇంటర్ నకిలీ సర్టిఫికెట్ల నుంచి తప్పుడు రిజిస్ట్రేషన్ల దాకా ఎదిగిన ఘనుడు
- దేహశుద్ధి జరిగినా మారని శ్రీనివాసుడి తీరు

## రిజిస్ట్రేషన్ అయ్యాక డాక్యుమెంట్ ఇవ్వకుండా ముప్పతిప్పలు

**ఖమ్మం బ్యూరో (జనంసాక్షి) :**

పుట్టుకతో వచ్చిన నైజం మధ్యలో పొమ్మన్నా పోతుందా? చచ్చే వరకూ పోనేపోదు. ఇది జగమెరిగిన సత్యం. ఈ శ్రీనివాసుడి తీరు కూడా ఇంతే. చిన్న నాడే పదో తరగతి, ఇంటర్మీడియట్ సర్టిఫికెట్లు సృష్టించిన ఘనుడికి తప్పుడు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పెద్ద పనేమీ కాదు కదా!? "మంచుకొండ"లాంటి గ్రామంలో పుట్టి కరుడుగట్టిన మోసపూరిత నైజాన్ని అలవర్చుకున్నాడు. అందుకే ఒక రాజకీయ వివాదంలో ఈ శ్రీనివాసుడికి ఒకసారి దేహశుద్ధి కూడా జరిగిందండోయ్.! ఆయన గురించి మరిన్ని విషయాలు చదివేద్దాం రండి!

సాధారణ కుటుంబంలో పుట్టిన తండ్రి వైరాలోని ఓ పార్ బాయిల్డ్ రైస్ మిల్లులో గుమస్తాగా పని చేసేవాడు. దీంతో పిల్లల్ని అక్కడే చదివించాడు. అయితే చిన్నప్పటి నుంచే వక్ర బుద్ధికి అలవాటు పడిన మన శ్రీనివాసుడు తండ్రి బాటను వదిలి అక్రమాల బాట పట్టాడు. ఆ వయసులోనే పదో తరగతి, ఇంటర్మీడియట్ సర్టిఫికెట్లను తయారు చేయాలన్న ఆలోచన రావడం అంటే సాధారణ విషయమా మరి.? ఈ ఫలితంగా ఒక పర్యాయం పోలీస్ కేసు నమోదై సీబీసీఐడీ  విచారణ కూడా జరిగింది. ఇలా నేర ప్రవృత్తికి అలవాటు పడిన శ్రీనివాసుడు తన, మన బేధం లేకుండా సొంత వారిని కూడా మోసం చేయడం అలవాటుగా మార్చుకున్నాడు. టెంట్ నుంచి పెంట్ హౌస్ వరకు ఎదగడానికి కారకుడైన, అసలు శ్రీనివాసుడికి రియల్ ఎస్టేట్ ను పరిచయం చేసిన తన సొంత చెల్లి భర్తనే మోసగించాడు. ఇక మరో సోదరి భర్తకు 10 ఎకరాల భూమిని విక్రయించి 4 ఎకరాలను మాత్రమే రిజిస్ట్రేషన్ చేసి అడ్డంగా ముంచాడు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ఇప్పుడు శ్రీనగర్ కాలనీలో ఉంటున్న ఇంటిని కొనుగోలు చేసిన సమయంలో అమ్మిన వారిని వంచించన తీరు నిజంగా ఘోరమైన అనైతికం. ప్రభుత్వ టీచర్ గా పని చేసి విరమణ పొందిన ఒక వ్యక్తి దగ్గర ఈ భూమిని కొని నాలుగో వంతు డబ్బుని చెల్లించాడు. ఆ తర్వాత ఆ రిటైర్డ్ ఉద్యోగి ఇద్దరు కూతుర్లకు మాయ మాటలు చెప్పి తండ్రి కూతుళ్ళ మధ్య చిచ్చు పెట్టాడు. ఈక్రమంలో సబ్ రిజిస్ట్రార్‌తో మిలాఖాత్ అయ్యి ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకుని తండ్రీ, కూతుళ్ళకు పంగనామాలు పెట్టేశాడు. ఇక మండల పరిషత్, పంచాయతీ రాజ్ శాఖల్లో పని చేసే ఇంజనీరింగ్ ఉద్యోగులకు ప్లాట్లు విక్రయించి రిజిస్ట్రేషన్ తర్వాత వారికి డాక్యుమెంట్ ఇవ్వకుండా ఇప్పటికీ చిత్ర హింసలకు గురి చేస్తున్న తీరు నిజంగా ఘోరాతి ఘోరం. రెడ్డి పేరున్న ఒక పంచాయతీ రాజ్ డీఈ రెండు ప్లాట్లు తన భార్య పేరుతో కొనుగోలు చేశాడు. ఆ తర్వాత ఆస్ట్రేలియా నుంచి వచ్చిన ఓ మహిళ తన భూమిని మీరెలా రిజిస్ట్రేషన్ చేయించుకుంటారని ప్రశ్నిస్తూ పోలీస్ స్టేషన్లో కేసు పెట్టింది. దీంతో శ్రీనివాసుడితో పాటు మరో ఇద్దరు నిర్వాహకులపై కేసులు నమోదైతే కాళ్ళావేళ్ళా పడిన శ్రీనివాసుడు ఆ కేసు నుంచి ఎలాగోలా తప్పించుకున్నాడు. అయితే ఆ ప్లాట్లు కొనుగోలు చేసిన డీఈ ఇప్పటికీ కోర్టు చుట్టూ తిరుగుతూ ఉండటం గమనార్హం. ఇలా రియల్ ఎస్టేట్ లో ఎన్నో వెంచర్లు వేసి వందలాది మందిని ముంచిన ఘనుడిగా ఈయనకు మహా చెడ్డ పేరుంది. ఇప్పటికీ నిత్య వివాదాస్పదుడిగా వర్ధిల్లుతూ వేలాది మంది జీవితాల్లో చిచ్చు రాజేసిన ఘనతను మూటగట్టుకున్నాడు. చివరికి తోడ పుట్టిన వారిని కూడా దూరం చేసుకుని ఇంటికి కనీసం చుట్టం చూపుగా కూడా ఎవ్వరూ రాని దుస్థితిని కోట్లు పెట్టి కొని తెచ్చుకున్నాడు మన శ్రీనివాసుడు.

